చెట్టు కింద బోధన... బాలల వేదన


బూరుగు గ్రామంలో ఏర్పాటు చేస్తున్న రేకుల షెడ్డు

- బూరుగు గ్రామంలో కానరాని పాఠశాల భవనం
- ఆరుబయటే చదువులు.. విద్యార్థుల అవస్థలు
- శ్రమదానంతో షెడ్డు నిర్మాణానికి గ్రామస్తుల చర్యలు
- టీడీపీ హయాంలో నిధులు కాజేసిన కాంట్రాక్టర్, ఇంజినీర్లు


బూరుగు గ్రామంలో పాఠశాల భవనం లేక చెట్టు కింద పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

అనంతగిరి(అరకులోయటౌన్): గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యా ప్రగతి పరుగులు తీసింది. మునుపెన్నడూ లేని విధంగా సర్కారు పాఠశాలల్లో అభివృద్ధి జరిగింది. కార్పొరేట్‌కు దీటు గా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాఠశాలల్లో అభివృద్ధి పనులకు నాడు -నేడు ద్వారా కోట్లాది రూపాయలు వెచ్చించారు. మన్యంలోని సర్కారు పాఠశాలల రూపురేఖ లు మారాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారా నాడు-నేడు పనులకు నిధులు మంజూరైనా ఎన్నికల కోడ్ వల్ల ఆటంకం కలిగింది. పాఠశాలల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. కొత్తగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలు కావస్తున్నా మన్యంలో ఒక్క అభివృద్ధి పని చేపట్ట లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు-నేడు ద్వారా మంజూరు చేసిన నిధులతో ఒక్క పాఠశాల లో పనులు చేపట్టిన దాఖలాలు లేవు. దీంతో కూట మి ప్రభుత్వ పాలనలో మన్యంలో విద్యా వ్యవస్థ కుంటు పడింది. పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేక చెట్ల కింద బోధన సాగుతోంది...ఎండకు ఎండి.. వర్షానికి తడిసి విద్యార్థులకు వేదన తప్పడం లేదు. తమ పిల్లల భవిష్యత్ ఏమిటని చిన్నారుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జన్మభూమి కమిటీ ఆధ్వర్యంలో పనుల నిలిపివేత

ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో మన్యంలో శివారు గ్రామాలకు విద్య అందని ద్రాక్షగా మారింది. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు భవనం నిర్మించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనంతగిరి మండలంలోని రొంపిల్లి పంచాయతీ పరిధిలోని శివారులో బూరుగు, చిన్న కోనిల గ్రామాలున్నాయి. ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థులు బూరుగు గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సుమారు 36 మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే 2015-19 మధ్యకాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామంలో పాఠశాల నిర్మాణానికి రూ.13లక్షల నిధులు మంజూరయ్యాయి. అయితే అప్పటి జన్మభూమి కమిటీ ఆధ్వర్యంలో కాంట్రాక్టర్, ఇంజినీర్లు కుమ్మక్కై నిధులు పక్కదారి పట్టించారని గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో పాఠశాల భవనం పునాదులతోనే నిలిచిపోయింది. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాలల అభివృద్ధి కోసం చేపట్టిన నాడు-నేడులో ఫేజ్-2 ద్వారా బూరుగు గ్రామంలోని పాఠశాల భవనం మరమ్మతు కోసం రూ.5.50లక్షల నిధులు కేటాయించారు. అయితే గ్రామంలో భవనం లేకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. అనంతరం ఎన్నికల కోడ్ రావడంతో పనులన్నీ స్తంభించాయి.

విద్యార్థుల తల్లిదండ్రుల శ్రమదానంతో తాత్కాలిక షెడ్డు

గ్రామానికి పాఠశాల భవనం లేదని, చెట్ల కింద పాఠాలు బోధిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టిపై కూర్చుని చదువుకోవాల్సిన దుస్థితి నెలకొందని చెబుతున్నారు. వర్షం పడితే పాఠశాలకు సెలవు.. అరకొర బోధన.. కనీస సౌకర్యాలు కరువు.. తదితర సమస్యలతో తమ చిన్నారులు సతమతమవుతున్నారని ఆవేదన చెందుతున్నారు. తమలో చాలా మంది నిరక్షరాస్యులని.. రోజు కూలీతో కుటుంబ పోషణ సాగిస్తున్నా మని చెబుతున్నారు. తమ పిల్లల భవిష్యతు బాగుండాలని, వారికి విద్యాబుద్ధులు నేర్పించాలనే తపనతో గ్రామస్తులంతా శ్రమదానంతో పాఠశాల కోసం ముందుకొచ్చామంటున్నారు. గతంలో జన్మభూమి కమిటీ సభ్యులు పాఠశాల కోసం పునాదు లు వదిలేసిన స్థలంలోనే తాత్కాలిక షెడ్డు నిర్మిస్తున్నామన్నారు. అందరూ విరాళాలు సేకరించుకొని షెడ్డు పైకప్పు రేకులు ఇతరత్రా సామగ్రి కొనుగోలు చేయనున్నట్టు చెప్పారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి తమ గ్రామంలో పాఠశాల భవనం నిర్మాణంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు

నిధుల దుర్వినియోగం



గ్రామంలో పాఠశాల భవనం లేక విద్యార్థులు, ఉపాధ్యాయుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎస్‌ఎస్‌ఏ ద్వారా నిధులు మంజూరైతే అప్పటి పాలకులు భవనం నిర్మించకుండా నిధులు దుర్వినియోగం చేశారు. పిల్లల కష్టాలు చూడలేక గ్రామస్తులంతా ఏకమై షెడ్డు నిర్మాణానికి పూనుకున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల భవనం నిర్మించాలి.

– సోమెల అప్పలరాజు, విద్యార్థి తండ్రి, బూరుగు గ్రామం

కష్టాలు తీర్చాలి



బూరుగు గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో 36 మంది విద్యార్థులు చదువుతున్నారు. బూరుగు, చిన్న కోనిల గ్రామాలకు చెందిన విద్యార్థులు ఇక్కడికి చదువుకునేందుకు వస్తున్నారు. గ్రామంలో పాఠశాల భవనం లేక చెట్టు కిందనే పాఠాలు బోధిస్తున్నాను. వర్షాకాలంలో వరండాల్లో కూర్చోబెట్టాల్సి వస్తుంది. పాఠశాలకు భవనం నిర్మించి కష్టాలు తీర్చాలి.

– బి. కృష్ణారావు, ఉపాధ్యాయుడు, బూరుగు గ్రామ పాఠశాల,అనంతగిరి మండలం

ప్రతిపాదనలు పంపాం



మారుమూల ప్రాంతంలో పాఠశాలకు భవన నిర్మాణానికి ప్రతిపాదనల కోసం ఐటీడీఏ నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు మండలంలోని బూరుగు గ్రామంలో ఎంపీపీ పాఠశాల భవనం కోసం ప్రతిపాదనలు పంపాం. పాఠశాల భవనం కోసం రూ.17.50లక్షలకు ఎస్టిమేషన్ కోటేషన్ నివేదించాం. నిధులు మంజూరై, అనుమతులు రాగానే పాఠశాల భవనం పనులు ప్రారంభిస్తాం.

– బి. గణేష్, ఏఈఈ, టీడబ్ల్యూ ఇంజినీరింగ్ శాఖ, అనంతగిరి మండలం

క్లుప్తంగా

పోలవరం నిర్వాసితుల సభ నేడు

ఎటపాక: సీపీఐ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా వేలేరుపాడులో పోలవరం నిర్వాసితుల సభ నిర్వహిస్తున్నట్టు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి స్వర్ణ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సదస్సులో ఏడు మండలాల నిర్వాసితుల సమస్యలపై చర్చించనున్నట్టు తెలిపారు. నిర్వాసితులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డుంబ్రిగుడ: మండలంలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పాడేరు డివిజన్ ఈఈ ఎం.వి.వి.ఎస్.అప్పారావు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 9 నుంచి సాయంత్రం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ మేరకు కొర్ర, కొల్లాపుట్టు, గసభ, సాగర, సొవ్వా, కించుమండ, కోరాయి, గుంటసీమ, గుంటగన్నెల, అరమ, డుంబ్రిగుడ, తూటంగి, కండ్రుమ్, కితలంగి పంచాయతీల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రుణాలు చెల్లించని రైతులకు నోటీసులు

రాజవొమ్మంగి: స్థానిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా 2014లో రుణాలు పొంది నేటికీ చెల్లించని రైతులకు నోటీసులు జారీ చేసినట్టు సీఈసీ గోపాలకృష్ణ విలేకరులకు చెప్పారు. ఇందులో భాగంగా సుమారు రూ. 42.50 లక్షల మేర అప్పులు పేరుకొని ఉన్నాయన్నారు. సెక్షన్-71 ప్రకారం నోటీసుల జారీ చేసామని, అప్పటికి చెల్లించకపోతే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి వితరణ


తెల్లం ముత్తయ్యకు వితరణ అందజేస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

కూనవరం: మండలంలోని చూచిరేవులగూడెంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయిన తెల్లం ముత్తయ్య కుటుంబానికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం నిత్యావసర వస్తువులు, టార్పాలిన్, దుప్పట్లు వితరణ చేశారు. సర్పంచ్ తెల్లం నిరోషా, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యనారాయణ, వెంకన్న, నాగేశ్వరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం పాలసీ నిబంధనలు పాటించాలి

పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం కొన్ని బ్రాండ్ల మద్యం ధరలను ప్రకటించిందని ఎక్సైజ్ సీఐ ఆచారీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మాన్సన్ హౌస్ 750 ఎంఎల్ పాత ధర రూ.870లు ఉండగా కొత్త ధర రూ.760లుగా, 375 ఎంఎల్ పాత ధర రూ.440 ఉండగా కొత్త ధర రూ. 380లుగా, 180 ఎంఎల్ పాత ధర రూ.220లు ఉండగా కొత్త ధర రూ.190లుగా ప్రకటించినట్టు పేర్కొన్నారు. పాడేరులోని మద్యం దుకాణాల్లో ప్రస్తుతం పాత స్టాక్ నిల్వ ఉండడంతో పాత ఎంఆర్పీకే విక్రయిస్తున్నారని చెప్పారు. కొత్త స్టాక్ వచ్చిన వెంటనే కొత్త ఎంఆర్పీకు విక్రయిస్తారని చెప్పారు. ప్రభుత్వం విధించిన మద్యం పాలసీ నిబంధనలు పాటించాలన్నారు.

బూత్ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక


సభ్యులను అభినందిస్తున్న బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఉమామహేశ్వరావు తదితరులు

పాడేరు రూరల్(అరకులోయ రూరల్): మండలంలో కొత్త పాడేరు గ్రామంలో బీజేపీ బూత్ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం నిర్వహించారు. బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఉమామహేశ్వరావు ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో కమిటీ అధ్యక్షుడిగా డి.బాలకృష్ణ, కార్యదర్శిగా మంగతల్లి ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, 10 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేస్తామన్నారు.రాష్ట్ర దళిత మోర్చా కార్యదర్శి రవి, మండల పార్టీ అధ్యక్షుడు అబ్బాయిదొర, నాయకులు గోపాల్‌పాత్రుడు, వెంకటరమణ, ఈశ్వరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం



చింతలవీధిలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ పూర్ణిమ


కిటుములలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ రమణమ్మ, ఎంపిటీసీ పద్మ

హుకుంపేట: మండలంలోని డి.చింతలవీధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ సమిడ వెంకట పూర్ణిమ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. డి.చింతలవీధిలో రూ.2.50లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్టు తెలిపారు. వార్డు సభ్యులు వెంకట్, నాయకులు సూరిబాబు, రామయ్య, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలో కిటుముల పంచాయతీలో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ రమణమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు పద్మ సోమవారం ప్రారంభించారు.పంచాయతీ పరిధిలోని పలడ, కిటుముల పంచాయతీ కేంద్రంలో 150 మీటర్లు ఈ రోడ్డు మేర నిర్మాణ పనులను పంచాయతీ నిధులతో చేపడుతున్నట్టు సర్పంచ్ తెలిపారు. సిమెంటు రోడ్డు నిర్మాణ పనులతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు ఆమె తెలిపారు. వార్డు సభ్యుడు రాధాకృష్ణ, పాండురాజు, బాలయ్యదొర గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఐక్య క్రిస్మస్ వేడుకలు


వేడుకలో పాల్గొన్న గ్రామస్తులు

ఎటపాక: మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఐక్య క్రిస్మస్ వేడుకలు సోమవారం రాయనపేట పంచాయతీ మంగువాయిలోని సోయం పాల్‌రాజ్ చర్చి వద్ద ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా క్రీస్తు జననం తెలిపేలా పశువుల పాక ఏర్పాటు చేసి అందంగా అలంకరించారు. ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. క్రిస్మస్ గీతాలు ఆలపించారు. చిన్నారులు సందడి చేశారు. కేక్ కట్‌చేసి అందరూ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ప్రసంగీకులు సంతోష్ దేవుని వర్తమానాన్ని అందించారు. ఫెలోషిప్ మండల అధ్యక్షుడు ఎజ్రా, ఏసుబాబు, ఇజ్రాయేలు, భీమయ్య, పీటర్ సింగయ్య, ఏలియా, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

మలుపు వద్ద నిలిచిపోయిన లారీ


జాతీయ రహదారి మలుపు వద్ద నిలిపిన కర్రలోడు లారీ

ఎటపాక: జాతీయ రహదారిపై జామాయిల్ కర్ర లోడ్ లారీ సాంకేతిక సమస్య వల్ల నిలిపోయింది. ఎటపాక మండలం చోడవరం, వెంకటరెడ్డిపేట మధ్యన ఉన్న ప్రమాదకర మలుపు వద్ద ఈ లారీ నిలిచి మూడు రోజులు అవుతుంది. మలుపు వద్ద నిలిచి ఉన్న లారీ ఎదురుగా వచ్చే వాహనదారులకు దూరం నుంచి కనపడే పరిస్థితి లేదు. లారీలోని కర్రలు రహదారిపై పడిపోయే స్థితిలో ఉంది. కేవలం కొన్ని కర్రలు ఆసరాగా లోడుకు ఉంచి రహదారికి మధ్యలో నిలిపారు. భద్రాచలం నుంచి వచ్చే వాహనదారులకు మలుపు వద్ద ఇబ్బందికరంగా మారింది. జాతీయ రహదారిపై నిత్యం భారీ వాహనాలు సైతం ఎక్కువగా తిరుగుతుంటాయి. ఇంత ప్రమాదభరితంగా లారీ రహదారికి మధ్యలో నిలిపి రోజులు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో వాహన దారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీ ప్రమాదం జరిగే అవకాశముందని ఇప్పటికైనా అధికారులు స్పందించి పాడైన వాహనాన్ని తక్షణమే అక్కడి నుంచి తొలగించాలని స్థానికులతో పాటు వాహనచోదకులు కోరుతున్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

పాడేరురూరల్,(అరకులోయ రూరల్): అత్యాచార ఘటన దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కన్వీనర్ రామారావు దొర తదితరులు పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఎల్.రజినీలను వేర్వేరుగా కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం రామారావు దొర మాట్లాడుతూ పాడేరు ఏకలవ్య పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనకు పాల్పడిన ల్యాబ్ అటెండర్ అనుజ్‌సింగ్ పటేల్‌పై పోక్సో కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రావు, సిబ్బందిని విధుల నుంచి తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ఈ ఘటన జరిగిందన్నారు. పాఠశాల, కళాశాలలో విద్యార్థినులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. డుంబ్రిగుడ మండలం జాముగుడ, జిమాడుగుల మండలంలో బందవీది పాఠశాలల్లో జరిగిన ఘటనలు మరవక ముందే ఇటువంటి సంఘటనలు వెలుగు చూడటం అధికారుల నిర్లక్ష్యం కూడా ఏస్థాయిలో ఉందో తెలుస్తుందన్నారు. తక్షణం అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని ఈ ఘటనపై నిజానిజాలు తేల్చాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. జేఏసీ మండల కన్వీనర్ సురేష్‌బాబు, నాయకులు భీముడు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన దారులతో అవస్థలు


బల్లుగూడ గ్రామంలోని ఓ వీధిలో రహదారి దుస్థితి

ముంచంగిపుట్టు: మండలంలోని కుమడ పంచాయతీ బల్లుగూడ గ్రామంలో సీసీ ర్యాంప్ లేక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. గ్రామంలో ఎక్కడ కూడా సరైన రహదారులు లేవు. వీధుల్లో రహదారులన్నీ రాళ్లు తెలిపోవడంతో రాకపోకలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు తాగునీటి బిందెలు పట్టుకొని వస్తున్న సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కాలంలో వీధుల్లో బురద నిలిచి ఉండడంతో నడవలేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీ ర్యాంప్ వేయాలని పలుమార్లు అధికారులకు కోరినా కనీస స్పందన లేదంటున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో వీధుల్లో సీసీ ర్యాంప్‌లు వేయాలని వారు కోరుతున్నారు.

సినిమా థియేటర్‌ను పరిశీలించిన సబ్ కలెక్టర్

రాజవొమ్మంగి: స్థానిక వేంకటేశ్వర థియేటర్‌ను రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ థియేటర్‌ను అనపర్తికి చెందిన ఓ వ్యాపారి లీజుకు తీసుకొని ఆధునిక హంగులతో, ఏసీ థియేటర్‌గా రూపొందించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు థియేటర్‌లో ప్రభుత్వ నిబంధనల అమలు, రికార్డులను ఆమె పరిశీలించారు. నిబంధలను అతిక్రమించొద్దని థియేటర్ యజమానికి సూచించారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దార్ సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

చెన్నుపాటి సేవలు మరువలేనివి



డుంబ్రిగుడ, ముంచంగిపుట్టులో చెన్నుపాటి లక్ష్మయ్య చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నేతలు

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని చెన్నుపాటి **లక్ష్మయ్య వర్ధంతి**ని యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. చెన్నుపాటి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా అల్లూరి జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు మహేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమానికి చెన్నుపాటి చేసిన సేవలు మరవులేనివన్నారు. అతని జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. యుటీఎఫ్ ఆయన ఆశయాలకు నిరంతరం కృషి చేస్తుందన్నారు. అటువంటి మహానుభావుల అడుగుజాడలో ఉపాధ్యాయులు నడుచుకోవాలని ఆయన కోరారు. జిల్లా కార్యదర్శి ఎస్.కన్నయ్య, మండల సీపీఎస్ కన్వీనర్ గెన్నుబాబు, తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతిని మండల కేంద్రంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎస్.రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి వృత్తికి చెన్నుపాటి చేసిన సేవలు శ్లాఘనీయమన్నారు. ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గోపిమూర్తి గెలుపుపై కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. గోపి, శ్రీనివాసమూర్తి, వీరన్న, ధనుపతి, రాజేంద్ర, సూర్యనారాయణ, గోవింద్, గణేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలపై సర్వే


సూచనలిస్తున్న ఎంపీడీవో కుమార్

అనంతగిరి(అరకులోయటౌన్): సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు, అన్ని రకాల వ్యాపార దుకాణాలు సర్వేలో అనంతగిరి మండలం వెనుకబడి ఉందని, దీన్ని అధిగమించడానికి పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు దృష్టి సారించాలని ఎంపీడీవో కుమార్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కుమార్ మాట్లాడుతూ మండలంలో వ్యాపార దుకాణాలు, వ్యాపార సంస్థలు ఉన్న వాటిని గుర్తించి, సర్వే చేసి ప్రభుత్వం నుంచి రుణ సహాయం అందేలా చూడాలన్నారు. ప్రతీ లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్, ఆధార్ నంబర్లను మొబైల్ బ్యాంక్ అకౌంట్‌కు అనుసంధానం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని పంచాయతీల హౌస్ హోల్డ్ జియో టాగింగ్ సర్వే రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఏదైనా కారణంతో పెండింగ్‌లో ఉంటే దానిని గుర్తించి తన దృష్టికి తీసుకురావాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మిస్సింగ్ సిటిజన్ డేటాను పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిసెంట్‌ల లాగిన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. స్వర్ణ పంచాయతీ వెబ్ సైట్‌లో పంచాయతీల అసెస్‌మెంట్ వివరాలను సక్రమంగా పంచాయతీ కార్యదర్శులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సచివాలయ సిబ్బందికి ఆన్‌లైన్ విధానంలో అటెండెన్స్ ప్రాప్తికి మాత్రమే జీతాల బిల్లులు పెట్టాల్సి ఉందని, కాబట్టి ప్రతీ రోజు ఉదయం 10.30కు ఇన్‌టైమ్, ఔట్ టైం సాయంత్రం 5 గంటలు తప్పనిసరి అని ఎంపీడీవో కుమార్ సూచించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

13న క్రిస్మస్ ఆరాధన

డుంబ్రిగుడ: మండలంలోని కోసంగి గ్రామంలో క్రిస్మస్ ఆరాధన కార్యక్రమాన్ని ఈనెల 13న నిర్వహించనున్నట్టు పాస్టర్ తిమోతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోసంగిలో ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో ప్రత్యేక ప్రార్థనలు, క్రీస్తు బోధనలు, సువార్త తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి పాస్టర్ ఎస్.బి.బెన్నీ ప్రత్యేక ఆహ్వానితులుగా వస్తున్నారని, ప్రతి ఒక్కరు పాల్గొవాలని కోరారు.

కొరవడిన పారిశుధ్యం


అరకులోయలోని ఓ వీధిలో పేరుకుపోయిన వ్యర్థాలు

అరకులోయటౌన్: జిల్లా కేంద్రం, ప్రముఖ పర్యాటక ప్రదేశమైన అరకులోయలో పారిశుధ్యం కొరవడింది. పట్టణంలోని ప్రధాన కూడళ్లతో పాటు వీధుల్లో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్త కుప్పల్లో ఎక్కువగా ప్లాస్టిక్ కప్పులు, ప్లాస్టిక్ బాటిళ్లు కనిపిస్తున్నాయి. రోజుల తరబడి చెత్త తొలగించడం లేదని స్థానికులు చెబుతున్నారు. దీంతో దుర్గంధం వ్యాపిస్తోందని, దోమలు బెడద ఎక్కువైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోగాలు ప్రబలే ఆస్కారముందని ఆందోళన చెందుతున్నారు. సీజన్ కావడంతో పర్యాటకులు ఎక్కువగా ఇక్కడికి వస్తుండడంతో వారి వెంట తీసుకొచ్చిన ప్లాస్టిక్ బాటిళ్లు, పాలిథిన్ కవర్లు ఇతరత్రా వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారని చెబుతున్నారు. అధికారులు ఈ మార్గాల్లో పయనిస్తున్నా పారిశుధ్యంపై కనీసం పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు


వై.రామవరం సీహెచ్‌సీలో పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి


చింతపల్లిలో గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది


అడ్డతీగలలో అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ వాసు

వై.రామవరం: పీఎంఎస్ఎంఏ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సోమవారం 88 మంది గర్భిణులకు సోమవారం ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగ్‌లు, రక్తపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వారిలో 22 మంది హైరిస్క్ గర్భిణులను గుర్తించి ఆస్పత్రిలో చేర్పించారు. వారికి ప్రత్యేక వైద్య సేవలతోపాటు, అవసరమైన మందులు అందజేశా రు. ఈ వైద్య శిబిరానికి హాజరైన గర్భిణులందరికీ భోజన వసతి, రవాణా సౌకర్యాలు కల్పించారు. గైనకాలజిస్టు డాక్టర్ బి.మోమీన, వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో వైద్యాధికారులు నరేంద్ర, దినేష్‌ల ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగులు, ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహించారు.

చింతపల్లి: గర్భిణులు క్రమం తప్పకుండా పోషకాహారాన్ని తీసుకోవాలని స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ అనూష అన్నారు. పీఎంఎస్ఎంఏ అభియాన్‌లో భాగంగా స్థానిక ఏరియా ఆస్పత్రిలో సోమవారం సుమారు 42 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూష మాట్లాడుతూ గర్భిణులు పోషక విలువ లున్న ఆహారాన్ని తీసుకోవాలని, ప్రతి రోజు క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అడ్డతీగల: పీఎం సురక్షిత్ మాతృత్వ అభియాన్‌లో పీఎంఎస్ఎం అభియాన్ కార్యక్రమంలో భాగంగా సామాజిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శశికళ గర్భిణులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరానికి వచ్చిన 86 మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. ఆస్పత్రి కౌన్సిలర్ నారే వాసు గర్భిణులకు ఆరోగ్యభద్రతపై సూచనలిచ్చారు. వైద్యాధికారి డాక్టర్ సతీష్, డాక్టర్ జీకెఎస్ ప్రసన్నదేవి, ఆస్పత్రి సిబ్బంది నాగమణి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.